# ఏదారి

"ఓ వారంరోజులు శెలవు పెట్టేశాను గీతా! తిరుపతికేసి వెళ్ళివద్దాం." అంటూ కొడుకు కోడలితో ప్రయాణం గురించి చెప్తోంటే సంబరంగా వింది కాంతమ్మ 'తిరుపతి' అన్న నాలు గక్షరాలూ కాంతమ్మ కడుపులో పుట్టెడు సంతోషాన్ని కలిగించాయి.

తిరుపతి గురించీ, తిరుపతి దేవుణ్ణి గురించీ కాంతమ్మ వినీవినీ బ్రతుకులో ఎప్పుడయినా ఒక్కసారి ఏడుకొండల వాణ్ణి కళ్ళారా చూడాలన్న కోరిక గుండెల్లో పెట్టేసుకొంది. ఆపద మొక్కుల వాడు... వడ్డి కాసులవాడు.. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడు... కళ్ళపడాలంటే ఎంత పుణ్యం చేసుకోవాలీ! వెంకటేశ్వరుణ్ణి గురించి... ఎన్ని చరిత్రలు... ఎన్ని మహత్యాలు... ఎన్ని...ఎన్నెన్ని వింది! చిన్నతిరుపతి దాటి – ఏడుకొండలూ ఎక్కి– పుష్కరణిలో శుచిగా స్నానం చేసి – ఆపద మొక్కులవాణ్ణి దర్శనం చేసుకొని – పాపనాశనంలో పాపాలు పోగొట్టుకుని – గోగర్భం దగ్గిర ఓ దణ్ణం పెట్టి – మంగాపురంలో అలిమేలుమంగతాయారమ్మని మొక్కి... అబ్బ! ఆలోచిస్తేనే ఒళ్ళంతా పులకరిస్తోందే!

తిరుపతి దేవుణ్ని చూడాలన్న ఆలోచనతోనే కాంతమ్మ మొహం విప్పారిపోయింది. వెనకాముందూ చూడకుండా కడుపులో కబురు కాస్తా వెల్లడించి వేసింది – "మీతో నేనూ వస్తానురా రామం ఏడుకొండలవాణ్ని చూడాలని వుంది"

అన్నదేకానీ సంతోషంకొద్దీ అక్కడ కూర్చోలేకపోయింది. 'అబ్బ! తిరుపతి వెళ్ళే కబురు వింటే నాగరత్నం ఎంత ముచ్చట పడుతుందో.' అనుకుంటూ లేచి పెరట్లోకి వెళ్ళిపోయింది.

భార్యాకేసి ప్రశ్నార్థకంగా చూశాడు రామం

గీత అదేం పట్టించుకోకుండా గదిలోకి వెళ్ళిపోయింది. రామం గదిలోకి వెళ్ళేసరికి మంచంమీద బోర్లా పడుకొని వుంది గీత. రామం వెళ్ళి భార్యాపక్కలో కూర్చున్నాడు– "మా అమ్మకూడా వస్తానంటోంది"

"ఊఁ"

"పోనీ తీసికెళ్దాం"

"బావుంది నా పెత్తనమేమిటి మధ్య"

"ఇందులో పెత్తనాల కేముంది? తనకైతానే అడిగింది కదా! దేవుణ్ని

ముప్పాళ రంగనాయకమ్మ



చూస్తానంటోంది. పోనీ ఆవిడమాత్రం ఇంకెప్పుడు చూస్తుంది !"

"ఈ సంజాయిషీలన్నీ నాకెందుకూ చెప్పటం ? అలాగే తీసికెళ్ళొచ్చు"

''నిజం చెప్పు నీ కిష్టం లేదా ? ''

గీత కాస్సేపు మాట్లాడలేదు. లేచి కూర్చుంది

"నా మనస్సులో మాట చెప్తున్నాను, మీరు తప్పుపట్టినా సరే! మన మిద్దరం బయల్దేరుతోంటే ఆవిడెందుకూ మధ్య?''

"నిజమే. ఆ విషయం అమ్మకి తెలియాలిగానీ..."

"మన మట్టుకు మనం వూరుకుంటే ఇంకెలా తెలుస్తుంది.

"మరి చేసే దేముంది ?''

"ఏమో ! అదంతా మీ యిష్టం నా వుద్దేశం మాత్రం చెప్పాను. తిరుపతి ఒక్కటే కాదుగదా వెళ్ళేది? మెడ్రాస్‌లో ఆగుతామన్నారు ఏవేవో చూడాలన్నారు. ఫ్రెండ్స్ నెవర్నో కలుసుకోవాలన్నారు. మనతోపాటు ఆవిడకూడా వస్తే యివన్నీ ఎలా అవుతాయి? సరే! మీ కేం అభ్యంతరం లేకపోతే నాకూ ఏం లేదు ''-గీత మంచం దిగి జడ విప్పుకొంటూ అద్దం ముందు కూర్చుంది.

గీతని చూస్తూ వుండిపోయాడు రామం.

గీత సౌందర్యంలో రామం వుక్కిరిబిక్కిరిగా మునకలువేసేంత ఆకర్షణ వుంది. గీత ప్రతీ కదలికా రామాన్ని ముగ్ధుణ్ణి చేస్తూవుంటుంది.

"గీతా ! నీలాంటి అందాలరాశి నాకు లభించటం...' అంటూ రామం ఎన్నిసార్లు తన అదృష్టాన్ని పొగుడుకున్నాడో గీతకి తెలియంది కాదు. అయినా గీత భర్తని ఎన్నడూ తేలిక చేసుకోలేదు భర్త హృదయంలో తనకి అంత వుత్కృష్టమైన స్థానం దొరకటం తన అదృష్టంగాకూడా భావించింది భర్త తనని ప్రేమగా చూసుకోవానికీ - అత్తగారి తిరుపతి ప్రయాణానికీ సంబంధం

పెట్టాలన్నదికూడా గీత వుద్దేశ్యంకాదు.

ఐనా గీత చెప్పిందని కాదు, రామానికి కూడా తల్లిని వెంటబెట్టుకు వెళ్ళటం బావుంటుం దనిపించలేదు. నిజాని కీ ప్రయాణం ఔ_త్తిగా తిరుపతి గుళ్లో దేవుడి విగ్రహాన్ని చూసి రావటానికే కాదు. తిరుపతి కొండలమీది ప్రకృతి సౌందర్యాన్ని గురించి ఎంతోమంది ఎన్నో విధాల చెప్తే విన్నాడు, అందాలభార్య గీతతోకలిసి ఆ కొండల్లో కోనల్లో విహరించాలనీ. ఆప్రకృతిలో లీనమైపోవాలనీ, ఆ ఆనందాన్నంతా రతీమన్మధుల్లా అనుభవించాలనీ గాఢమైన కోరిక పెంచుకొన్నాడు.

అంతేకాదు; మద్రాసులో తప్పకుండా ఆగాలి. ఆ మహానగరాన్నంతాచూడాలి, గీతకి చూపించాలి. స్టుడియోలు — పార్కులు — బీచ్‌లు — థియేటర్లు — బజార్లు — ఎన్నో చూడాలి. వీలైతే యాక్టర్స్‌ని కలుసుకోవాలి ఫ్రెండ్సంతా ఎక్కడెక్కడున్నారో గాలించి చూసి రావాలి. మొత్తంగా ఈ ప్రయాణమంతా ఒక మధురస్మృతిగా చేసుకోవాలి. పెళ్ళయిన ఏడెనిమిది నెలలలో నూ — గీతతో కలిసి ఎన్నిషికార్లు తిరిగినా — ఎన్ని సినిమాలు చూసినా—ఎన్ని విహారాలు చేసినా—ఎంత ఆనందం అనుభవించినా— ఇంకా ఇంకా ఎన్నోకోరికలు పుడుతూనే వున్నాయి. ఎంతో వుత్సాహం వుబుకుతోంది. ఎంతో వెత్తిమిగులుతోనేవుంది.

ఇప్పు డీ ప్రయాణంలో అమ్మని వెంటబెట్టుకుపోతే...?

నిజమే. అవి దేం అల్లరిపెట్టే మనిషి కాదు ఎక్కడ వుండమంటే అక్కడే వుంటుంది ఎలాచెప్తే అలాగేవింటుంది. తన తిరుగుళ్ళకి అమ్మ అడ్డు వస్తుందనీ అనుకోడు అయినా...

అసలా తల్లిని ... వెంటబెట్టుకు ప్రయాణం చేసే సాహసము లేదు ఆ కొడుక్కి.

అందాలగీతని ఎవరికైనా చూపిస్తూ— "నాభార్య" అని గర్వంగా చెప్పుకోగలిగే రామానికి, కాంతమ్మని — పుటకతోనే అందం తెచ్చుకోలేని కాంతమ్మని—నల్లటి నలుపూ—ఎత్తుపళ్లూ—నిమ్మకాయలా జుత్తు ముడీ — నీరుకావి సైను గుడ్డలూ — అదే ఆకారంతోవుండే తల్లిని — "ఈవిడ మా అమ్మ" అని చెప్పుకోగల్గే నిబ్బరంలేదు.

ఇంట్లో వుండి— వంట చేసిపెడుతూ— తన ఆనందాన్ని చూసుకుంటే చాలదా అమ్మకి ?

పడుచువాళ్ళతోపాటు సరదాలు జరుపుకోవాలంటే ఎలా వీలౌతుంది ? అమ్మ అయితే అవుగాక; తనకీ — తనభార్యకీ మధ్య ఏంతవాళ్ళకైనా స్థానంలేదు.

గీత జడ అల్లుకుని లేచింది

రామం ఆలోచనలతో సతమతమౌతూ మౌనంగా వుండిపోయాడు భార్యాభర్తల మధ్య మళ్ళా ఆ ప్రస్తావన రానేలేదు.



తిరుపతి ప్రయాణం ఒక్కరోజే వుంది. ముసురుపట్టింది వర్షం కుండ పోతగా పడుతోంది. రోడ్లన్నీ మహా నదులై ప్రవహిస్తున్నాయి.

"అబ్బాయీ! వాన యిల్లా కురుస్తోంది. ప్రయాణం కుదురుతుందా బాబూ!" భయంగా అడిగింది తల్లి.

"రైల్లో వెళ్ళేవాళ్ళకి వానా గీనా ఏమిటి? మహా దర్జాగా వెళ్ళచ్చు."

కాంతమ్మ మనుస్సు కుదుటపడింది. ఆ ఒక్కరోజూ గడిచింది. వర్షంకూడా కాస్త తెరిపి యిచ్చింది.

కొడుకూ కోడలూ బెడ్డింగు సర్దుకొంటోంటే కాంతమ్మ గబగబా వంట ముగించుకుని తెల్లగా వుతుక్కున్న చేతి

పంచీలో రెండు పంచెలూ - ఓ దుప్పటీ పాత పంచిగుడ్డా - సర్దుకొంది తల దువ్వుకోటాని కో చెక్కదువ్వెన పడేసుకొంది.

కొడుకూ కోడలూ అన్నాలు తింటోంటే కాంతమ్మ గబగబా పెరటి గోడదగ్గిరికి వెళ్ళింది.

"అమ్మాయ్ నాగరత్నం' అంతా అయినట్టేనమ్మా. వాళ్ళిద్దరూ భోజనాలు చేస్తున్నారు. నేనుకూడా ఓ ముద్ద తిని... ఏం తినటమో ! కడుపంతా నిండిపోయి నట్టేవుంది — గిన్నెలు కడిగేస్తాను కాస్త యిల్లు కనిపెట్టి చూస్తూవుండమ్మా! గులాబీ పువ్వులు నువ్వు కోసుకో మొన్నే చెప్పానుకదూ !"

"అలాగేలెండి పిన్నిగారూ ! క్షేమంగా వెళ్ళిరండి ఎంత పుణ్యం చేసుకున్నారో, వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుంటున్నారు ఆరోజు మా కెప్పు డొస్తుందో మీకూ తెలుసుకదూ? మా పెద్దవాడికి మొక్కువుంది, ముడుపు కూడా కట్టేసే "

"పోనీ ఆ ముడుపు నా కిస్తావా? జాగ్రత్తగా సంచీలోపెట్టి తీసుకెళ్ళి డిబ్బెంలో వేస్తాను "

"అలా కుదురుతుందా పిన్నిగారూ? ఒసారి మే మందరం ఎలాగూ వెళ్ళాలనుకొంటున్నాంలెండి."

"ముందు మీరు చూసివచ్చి అన్నీ చెప్పాలి సుమా !" కాంతమ్మ ముసిముసిగా నవ్వుకొంటూ—"వెళ్తానమ్మ !" అనేసి వంటింట్లోకి వచ్చేసింది. ఎంగిలి కంచాలు రెండూ గడపదగ్గిరే వదిలేసింది గీత.

గీత తలదువ్వి రింగుపెట్టి ముడిపెట్టుకుంటోంటే రామం వెనగ్గానిలబడికొంచెం సాయం చేస్తున్నాడు - కాంతమ్మ నవ్వుకొంది.

గీత తీసిపెట్టుకున్న జరీచీర రామానికి నచ్చలేదు - "ఎర్రసిల్కుచీర . కట్టుకో" అన్నాడు

"అబ్బ' ఇంతచలిగా వుంది. సిల్కుచీ రేమిటి ?"

"నీ మొహం ? చలేమిటి?" అంటూ రామం జరీచీర పెట్టేసి టెర్లిన్‌చీర తీసి యిచ్చాడు గీత అందంగా దంతం బొమ్మలా తయారైంది రామం చిలిపిగా క్రీకంట చూస్తోంటే సిగ్గుపడిపోయి అద్దంముందు నిలబడింది

కాస్సేపు వీధిగుమ్మంలో నిలబడి రోడ్డుమీద పోతోన్న రిక్షా పిల్చాడురామం

కాంతమ్మకూడా ఓ ముద్దతిని - గిన్నెలన్నీ కడిగి బోర్లించేసింది పెరటి తలుపులు వేసేసి చేతిసంచీ దగ్గిరపెట్టుకుని గడపలో కూర్చుంది.

రిక్షావాడు బెడ్డింగు రిక్షాలో వేశాడు. గీత వెళ్ళి రిక్షాలో కూర్చుంది, రోడ్డు కేసిచూస్తూ. రామంకూడా బూటు వేసుకుని నిలబడ్డాడు పర్స్‌లోంచి ఓ పది




రూపాయల నోటు తీసి తల్లిచేతి కివ్వ బోయాడు

కాంతమ్మ ఆయోమయంగా చూసింది.

"ఏమిట్రా యిది ?"

' నీదగ్గిర వుంచుకో. ఏమైనా కావాలంటే తెప్పించుకోవచ్చు ఈసారి పెద్దవాళ్ళెవరైనా వెళ్తోంటే నిన్ను వంపిస్తానమ్మా ! మాకా మద్రాసూ అదీ వెళ్ళాల్సిన పనివుంది వెళ్తాను మరి. రైలుకి టైమై పోతోంది '' వెనక్కి చూడకుండా గబగబా అడుగులు వేసుకొంటూ వెళ్ళి రిక్షాలో కోడలిపక్కన కూర్చున్న కొడుకుని చూసింది కాంతమ్మ.

రిక్షా నీళ్ళు చిందించుకుంటూ వెళ్ళిపోయింది. కర్రలా బిగుసుకుపోయిన కాంతమ్మ...ఎప్పటికో.. ఎప్పటికో... తెప్పరిల్లి ..ద్వారబంధానికి తల బాదుకొంది-"నాయనా! రామం రామం ." అంటూ.

* * *

పాపం కాంతమ్మని పసితనంనుంచీ దౌర్భాగ్యం అంటిపెట్టుకునే ఏడుస్తోంది

కాంతం సామాన్యమైన పల్లెటూళ్ళో సర్వసామాన్యమైన పేదకుటుంబంలో పుట్టింది

తొలిచూలు - కొడుకునే కనాలని సంబరపడిన మంగమ్మ - నల్లగా వికారంగా ఎలుకపిల్లలా పుట్టిన కూతుర్ని చూసుకుని బావురు మని ఏడ్చింది "ఛీ!

ఆడముండే పుట్టింది.'' అని ఛీత్కరించుకున్నాడు తండ్రి.

"పోనీ దేవు డిచ్చాడు ఆడో, మొగో. కాస్త అందంగా ఐనా పుట్టి చచ్చిందా" అంటూ మళ్ళా ఘొల్లుమంది మంగమ్మ.

"ఊరుకోవే మంగమ్మా." నీకూతురు నీ పోలికల్తోటే పుట్టింది. నీకు లేని అందం దాని కెలా వస్తుంది? నువ్వేం ఎర్రగా బుర్రగా రంభలా మిడిసిపడుతున్నావా?" అంటూ ఎవతో వేళాకోళం ఆడితే కుక్కిన పేనులా నోరు మూసేసుకుంది.

''ఫర్వాలేదు. వయసొస్తే పంకర కాళ్ళు తిన్నగా ఒస్తాయంటారు. ఈడొస్తేసరి, ఆడే సోగ్గా వుంటుంది." అంటూ ఆ పేరంటక్కే మళ్ళా ఓదార్చింది.

పురుడు దాటేసరికి మంగమ్మ మనసు కూడా కాస్త స్థిమిత పడింది. ఏడాది తిరగొచ్చేసరికి కాంతం పైపళ్ళు రెండూ పెదాలమధ్యకి పొడుచుకొస్తే మంగమ్మ ఆశ కాస్తా చల్లారిపోయింది. "కారు నలుపు... ఎత్తుపళ్ళు—ఇదేం కర్మరా దేవుడా," అంటూ వాపోయింది. బిడ్డ మీద కన్నతల్లి ప్రేమ ఏమిటో మంగమ్మకి తెలియనేలేదు.

నెలల తరబడీ కాంతం గురించి విచారిస్తూ కూర్చోటానికి తర్వాత పుట్టినపిల్ల మాటో! అదీ ఆడముండే! కాకపోతే కాంతంకన్నా ఓ ఛాయ మెరుగ్గావుంది. దాని తర్వాత కూడా ఇద్దరు ఆడపిల్లలే పుట్టారు. నిండా మునిగినవాళ్ళకి చలేమిటన్న ధోరణిలో పడింది మంగమ్మ. అందరిమీదకోపం కలిసి ఒక్క కాంతం మీదే! "ముందీ ముండ పుట్టకుండావుంటే ఆళ్ళంతా ఆడముండ లయ్యేవాళ్ళు కాదు.'' అంది ఎన్నోసార్లు మంగమ్మ కూతుర్ని తిడుతూ.

ఏడాది తిరక్కుండా పాలు మానిపించేసిన్నాడే పసిపిల్లకీ తల్లికీ ఎడబంధాలై పోయేది. అమ్మా అయ్యా చేరదియ్యక పోయినా - లాలించక పోయినా - ఆడపిల్లలంతా నిక్షేపంలా పెరిగేవాళ్ళు. అసలు కాంతంమీదే కాదు, మిగతా పిల్లలమీదకూడా మంగమ్మకు పట్టరాని అభిమానా లేం లేవు.

ఐదోసారి నీళ్ళాడి కొడుకుని కంది మంగమ్మ. ఆ రోజు తల్లి దండ్రుల మొహాలు చూసిన కాంతం తెలిసీ తెలీని వూహతో తనుకూడా సంతోషపడింది. పురిటినాడు జరిగిన తతంగం కాంతం చిన్నమనస్సుని ఆశ్చర్యంతో వుక్కిరిబిక్కిరి చేసింది.

ఎన్నడూ పిల్లల్ని ఎడంచేత్తోకూడా ముట్టుకోని అయ్య - అంత చంటివెధవనీ పొత్తిళ్ళల్లో పెట్టుకు కూర్చున్నాడు. ఊళ్ళో వాళ్ళందరికీ భోజనాలవీ పెట్టారు. శాంతి చేయించి పంతుళ్ళకి సంభావనలవీ యిచ్చారు. పసివాడికి మురుగులూ, మొల్లో పిండెలూ చేయించి కట్టారు.

తర్వాత మాత్రం వాడి కెన్ని ముద్దు ముచ్చట్లు జరిగాయి! ఎన్ని అంద చందాలు జరిగాయి!

అందుకే కాంతానికీ — మిగతా అప్ప లకీ కూడా తమ్ముడంటే యిష్టం! చాలా యిష్టం! "వాడు మొగపిల్లవాడు. చాలా గొప్పవాడు."

ఓసారి కాంతం తమ్ముణ్ణి సంబరంగా ఒళ్ళో పెట్టుకు కూర్చుంది. అప్పలంతా చుట్టూ చేరారు.

ఉన్నట్టుండి పసివెధవ కేరుమన్నాడు. కాంతం కంగారు పడుతోంటే మంగమ్మ దొడ్లోంచి పరుగెత్తుకొచ్చింది — కాంతం మాడుపట్టున గుంటపడేలా మొట్టికాయ వేసింది. గ్రుద్రున కళ్ళనీళ్ళు తిరిగాయి కాంతానికి.

"ఏంచేశావే కుర్రోణ్ణి?"

"ఏం చెయ్యలేదమ్మా!" బిక్క మొహంతో అంది కాంతం.

"ఛీ! అబద్ధాలముండా! ఎక్కడో గిల్లావు," అంటూ కొడుకుని చేతుల్లోకి తీసుకుని ఒళ్ళంతా పరీక్షలుచేసి చూసింది. మొలమీద గుల్లగావున్న మామిడిపిందె గట్టిగా ఒత్తుకుపోయిన గుర్తు కన పడింది. అలా అప్పుడప్పుడూ అవి ఒత్తుకుని పిల్లవాడు కెవ్వుమని ఏడవటం మంగమ్మకి తెలియందికాదు. అయినా ఆతాడు విప్పదు — "మొగపిల్లోడికైనా ముద్దూముచ్చాటా లేకండా ఎల్లా?"

"ఈసారి జాగర్తగా ఎత్తుకుంటావా?" తలవూపింది కాంతం. తమ్ముణ్ణి మళ్ళా కాళ్ళమీద పడుకోబెట్టుకుంది. తల్లిని చూడగానే వుండేలు చూసిన కాకుల్లా ఎగిరిపోయిన పిల్లలు మళ్ళా చేశారు తమ్ముడిదగ్గిరికి. తమ్ముడు తప్ప టడుగులు వేస్తూ మీదబడి తొక్కినా గుప్పెళ్ళకొద్దీ జుట్టుపీకినా — కర్ర పట్టుకొచ్చి వీపులు చిట్లకొట్టినా — ఏం చేసినా ... ముద్దుగానే చూడాలనేది మంగమ్మ.

మిగతా పిల్లలకి ముద్దూ — ముచ్చట్లూ లేకపోయినా తిట్లూ దీవెనలూ లేవు.

కాంతం పెద్దది. పన్నెండోఏడుకూడా జొరబడింది. పాతకోకల్లో గుడ్డలు పైట కూడా వేసుకుంటోంది. మంగమ్మ ఏపేటా చూలింతా బాలింతా అయి రోగాలతో — తెగుళ్ళతో — సంవత్సరానికి సగంరోజులు మూల్గుతూ మూలుగుతూ పడుకుంటే — ఎటొచ్చీ చేతికి సాయంగా వుండేది కాంతం ఒక్కతే; ఏదో బాముకో వాలని అందరికన్నా ముందు పుట్టిచచ్చింది కాబట్టి — చాకిరీకోసం పుట్టిన ఆడముండ కాబట్టి — తాడిని తలదన్నేలా ఎదుగు తోంది కాబట్టి.

తల్లి కాస్త నిదానంగా మాట్లాడిన పూట కాంతానికి గంపెడు ఆనందంగా వుండేది. తల్లి మెప్పు పొందాలన్నట్టు ఇంట్లో పనులన్నీ చెప్పకుండా చేసుకు పోయేది. ఎప్పుడేనా నోరుతెరిచి "అమ్మా!" అని పిలిస్తే — "ఎందుకే

అమ్మా! బొమ్మోను? ఎధవ కూతురివి బయల్దేరావు." అంటూ ఈసడించేసేది మంగమ్మ.

ఓసారి — "అమ్మా!" అంటూ భయంగానే పిల్చింది కాంతం.

"అలా అరవద్దని చెప్పానా? ఆ కవురేదో చెప్పిచావరాదూ?"

"మరేమో...తమ్ముడేమో...లాగూ జేబునిండా బియ్యం పోసుకున్నాడే. నేను చూసి పట్టుకోబోతే చేతులు గిల్లేసి పరిగెత్తుకు వెళ్ళిపోయాడే!"

"ఓహో! అదా కవురు? మీరంతా పూటకి సోలెడేసి బియ్యం బద్దలు కొట్టుకోటం లేదూ? ఆ చంటి ఎదవ... ఏదో చేశాడని...అస్తమానూ వాడిమీదే వుంటాయేం నీ కళ్ళు?"

అదీ వరస! ఆ యింట్లో ఆడ ముండలమధ్య మొగ మహారాజై పుట్టిన శివరావుదే రాజభోగం ఆఁ అనేవాళ్ళు లేరు, ఊఁ అనేవాళ్ళు లేరు. ఉన్నంతలో అయ్యతో సమానంగా పెరుగులూ నేతులూ వేసి మంచితిండీ_కొత్త కొత్త గుడ్డలూ_జేబుల్లో చిల్లర డబ్బులూ_ఊరుమీద తిరుగుళ్ళూ...వాడేం చేసినా మంగమ్మ వూరుకొంటుంది పైగాచెప్పిన వాళ్ళని తిడుతుంది ఇక తండ్రిమాటా? ఎప్పుడు యింటి కొస్తాడో_ఎప్పుడు పొలం పోతాడో పిల్లలకి తెలీదు.

* * *

కాంతం ఈడేరింది.

మంగమ్మ వలవలా ఏడ్చింది_ కూతురికి మొగుడెలా దొరుకుతాడా అని. కట్నాలూ కానుకలూ గుమ్మరించేమాట ఒట్టిది. పోనీ పిల్ల అందచందాలు చూపిద్దామా అంటే.. హుఁ!అదేగా గోలంతాను.

తాడిలా ఎదిగి తిరుగుతోన్న కాంతం మంగమ్మకి గుండెలమీద కుంపటిలా అయింది. మంగమ్మ అదృష్టమో ఏమోగానీ బుచ్చిరాజు పెళ్ళాం పోయిందని కబురు తెలిసింది.

బుచ్చిరాజు మంగమ్మ తమ్ముడే.

మంగమ్మకన్నా రెండుమూడేళ్ళ చిన్న.

జ్వరం వచ్చి మరదలు హఠాత్తుగా పోయిందన్న కబురు తెలియగానే మంగమ్మబుర్ర బోలెడు ఆలోచన చేసింది. కలకల్లాడే మొహం బలవంతంగా మాడ్చుకుని పుట్టింటికి బయల్దేరింది.

బుచ్చిరాజు పెళ్ళాం దినవారాలయ్యాయి. మంగమ్మ తమ్ముణ్ణి వెంట దీసుకొని మరీ వచ్చింది యింటికి

బుచ్చిరాజు అప్పగారింటికొచ్చి కూడా చాలాకాల మైంది పెద్దపిల్లలకి తప్ప మిగతావాళ్ళకి మేనమామ గుర్తు లేడుకూడాను.

కాళ్ళకి నీళ్ళిచ్చిన కాంతాన్ని బుచ్చిరాజు ఎగాదిగా చూశాడు నిజంగా వయస్సొచ్చిన తర్వాత కాంతం ముద్దబంతి పువ్వులా అందంగానే వుంది కాస్త పళ్ళు ఎత్తయినా ఆ మొహంలో ఆకర్షణ లేకపోలేదు.




కాళ్ళమీద నీళ్ళు ఒంపుకుని కాసిన్ని నీళ్ళు మేనగోడలిమీద చిలకరించాడు. కాంతం ముందు తెల్లబోయి తర్వాత మొహం చిట్లించుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది

మేనమామంటే కాంతానికి చాలా భయం! ఒకరకమైన అసహ్యం కూడాను

ఎప్పుడో చిన్నప్పుడో సారి అమ్మమ్మగారింటి కెళ్ళినప్పుడు కాంతం, బుచ్చిరాజు నిజస్వరూపం చూసింది. కోడి పందేలకి వెళ్ళటానికి డబ్బు యిమ్మని పెళ్ళాన్నడిగాడు బుచ్చిరాజు తనదగ్గిర రొఖ్ఖ చిల్లిగవ్వకూడా లేదంది పెళ్ళాం. గబగబా పెట్టె బద్దలుచేసి గుడ్డలన్నీ చిందరవందరచేసి రెండు రూపాయలు వెదికితీశాడు.

"దొంగముండా! ఈ సొమ్ము ఎవడికోసం దాశావే?" అంటూ పెళ్ళాన్ని పట్టుకుని గొడ్డునిబాదినట్టే బాదాడు.

కాంతం భయంతో గజగజలాడిపోయింది మంగమ్మగానీ – ముసిల్దిగానీ బుచ్చిరాజుని అడ్డుకోలేదు. తర్వాత ఎప్పుడో కాంతం ఒక్కత్తీ అత్తదగ్గిరికి వెళ్ళికూర్చుంది. ఎడంకన్నుమీద చర్మం చిట్లి రక్తం కారి అట్టకట్టుకుపోయింది అత్త లేచి అన్నంకూడా తినలేదు. ఏడుస్తూ – మూలుగుతూ, బాధపడుతూ పడుకొంది.

కాంతానికి మేనమామంటే తగని

అసహ్యం వేసింది. కంటిమీద నెత్తురు అట్టకట్టి అత్త మూలుగుతూ పడుకున్న దృశ్యం కాంతానికి గుండెల్లో పచ్చి పుండయింది.

చిన్నతనం పోయి కాస్త వయస్సు వస్తోన్నకొద్దీ మేనమామ లక్షణాలన్నీ కాంతానికి అర్ధమౌతూనే వుండేవి.

బుచ్చిరాజు జల్సారాయుడు. గొడ్ల చావిళ్ళలో చీట్లపేకకీ, తాటితోపుల్లో కల్లుముంతకీ, వూరి పొలిమేరల్లో కోడి పందేలకీ డప్పుమోగేచోట భోగం మేళాలకీ, తిరుగుతూ యిల్లూ వాకిలీ - పొలం పుట్రా ముసిలితల్లికీ - పెళ్ళానికీ వదిలేసి నిర్భాచీగా కాలం గడిపేస్తాడు,

తమ్ముడి గుణగణాలన్నీ మంగమ్మకి తెలియనివి కావు. అయినా "మొగాడు ఎలా తగలడ్డా మహారాజే. మంచేమిటి, చెడ్డేమిటి?"

సమయం చూసి తమ్ముణ్ణి కదలెయ్యాలని అనుకుంటూ వుండగా - తిండి తిని నులకమంచంమీద కూర్చుంటూ బుచ్చిరాజే అన్నాడు- "అప్పా, కాంతం బాగా ఎదిగిందే!"

"ఆఁ ఎదిగింది. ఎదగటానికేం బీద తనవాఁ? దానిమట్టుకది తాడిలా ఎదుగుతోనేవుంది. మొగుణ్ణెలా కట్టబెట్టడమా అని నా మట్టుకు నేను తలబద్దలు కొట్టుకు చస్తున్నాను"

"అదేంటే అప్పా, ఎలాగో అవుద్దిలే."

మంగమ్మ కడుపులోమాటకాస్తా అనేసింది- "ఇంకెలా అవుద్దిరా? మంచికే వచ్చిందో చెడ్డకే వచ్చిందో నీ పెళ్ళాం కాస్తా కన్ను మూసింది. ఎనకాల పిల్లా జెల్లా, బాదరాబందీ లేదు. ఇక నువ్వు తప్పితే నా కెవ్వరూ కనపట్టంలేదు"

బుచ్చిరాజుకి కొంచెం ఆశ్చర్యం వేసింది. తనగురించి అప్పకంతా తెలుసు. అదీకాక కాంతం తనకన్నా బాగా చిన్నది.

"ఏంరా బుచ్చీ...ఆలోచిస్తున్నావు."

"అబ్బే ఏంటీలేదు."

"ఏం? కాంతం నీకూ నచ్చలేదూ?"

"అబ్బే! అది కాదు," - ఎలాగూ తను రెండోపెళ్ళి చేసుకోకుండా వుంటాడని కాదు. ఎక్కడో దూరం యింటి పిల్లని...ఇంకా కాస్త అందంగా షోగ్గా వున్నదాన్ని...

విచారంతో తల దించేసుకొంటూ - "నా కిప్పుడు పెళ్ళేంటే అప్పా? ఒక మూల అది పోయి..."

"ఊరుకోరా బుచ్చీ! పోయినవాళ్ళతో పోతావా? ఇదేం ప్రపంచకవా? వల్ల కాడా? నువ్వంత ఇదై పోటానికి అది వున్నన్నాళ్ళూ నిన్నేం సుకపెట్టిందనీ? చీటికి మాటికీ ఏడుపులూ—మొత్తుకోళ్ళూ, ఎవదెరగందీ?"

బుచ్చిరాజు సానుభూతి కోసం చూశాడు.

"కాంతం మన యింట్లోపిల్ల. నిన్నేం ఆఁ అంటదా? వూఁ అంటదా? కుక్కిన పేనులా పడివుంటది. నీ ప్రాణానికీ తెరిపి.''

"సరే లేవే అప్పా! ఇప్పు డేంటి కంగారు?"

"అలా కాదులేరా బుచ్చీ! ఇంత దాకా వచ్చాక ఏముకా తేల్చేసుకోటమే మంచిది. మళ్ళా ఏదోటారి చూసుకోవాలిగా?"

బుచ్చిరాజు పళ్ళికిలిస్తూ వేళాకోళం లోకి దింపాడు—"నీకూతురేం అందంగా మిడిసిపడి పోతందా? ఆమొద్దుమొహం దాన్నెవడు కట్టుకుంటాడే అప్పా?"

మంగమ్మ కళ్ళొత్తుకుంది. "అందరి లాగా నువ్వూ అలాగంటే ఎలాగరా బుచ్చీ? తోడబుట్టినదాని కష్టం నీకష్టం కాదట్రా! అందం కొరుక్కుతింటావా? గుణం చూసుకోవాలిగానీ. నీపెళ్ళాం ఎర్రగా బుర్రగావుండేది. నిన్నేం సుఖపెట్టిచచ్చింది?"

"నిష్ఠురాలాడి నీకూతుర్ని కట్టబెడదా మనుకొంటున్నావుగానీ బావ నా కేటిస్తాడే అప్పా?''

"నీకు తెలియం దేంటుంది చెప్పు? ఎక్కడున్నావే గొంగళీ... అన్నట్టు అనా డెలాగున్నాడో ఈనాడూ అలాగే వున్నాడు నీబావ. ముద్దమింగి—పొలానికి పోటం తప్పితే పెళ్ళాం బిడ్డలూ ... అని ఆలోచించేపాటి తెలివి ఏడిసిందా మడిసికి? నీకు కట్ట బెట్టి ఒక్కదాన్ని ఇరగడచేసుకుంటే అయ్యిందా? వెనకాల దెయ్యాల్లా లేరూ? ఆళ్ళందరికీ ఏంటిస్తాడో, ఎలా ముళ్ళే యిస్తాడో ఆ భగమంతుడికే తెలవాలి."

మంగమ్మ కళ్ళనీ ళ్లొట్టుకుంది బుచ్చి రాజు చూసీ చూడనట్టు వూరుకున్నాడు. కాస్త గొంతు తగ్గించి చెప్పింది మంగమ్మ.

"నాదగ్గిర పదో పరకో లేక పోలేదులే; నీ ముద్దూ ముచ్చటా నేను జరుపుకోక పోతానా? కాంతం గొడ్డులా చాకిరీ చేస్తది. ఇంటికాడ వుండి ఎచ్చగా నీకింత ఒండి పడేస్తది. పరాయిదాన్నెవ తిని కట్టుకున్నా నీకింత ఒద్దిగ్గా వుంటదా ఆలోచించుకోరా బుచ్చీ!''

తమ్ముడు ఆలోచించాల్సిం దంతా అప్పగారే ఆలోచించి పెట్టిందిగాని మొగుడేంచేసినా కాంతం కిక్కురు మన దని హామీయిచ్చిందిగా? ఎలాగో మహా బలవంతంమీద కాంతాన్ని కట్టుకోటానికి ఒప్పుకున్నాడు బుచ్చిరాజు.

కబుర్లన్నీ విన్న కాంతం దిగాలుపడి కూర్చుంది బుచ్చిరాజంటే కాంతానికి రోత! తగని అసహ్యం!

'అమ్మా! నేను మామయ్యాని చేసు కోనే! నాకీ పెళ్ళి యిష్టంలేదే.' అని కనీసం అభిప్రాయం వెల్లడించవచ్చు ననికూడా తెలీదు కాంతానికి.

"అడికి పిల్ల నియ్యటం ఏంటి ? దేశదిమ్మరి ఎధ" వన్నాడు కాంతందాబు.

"నీ కూతురి అందచందాలకీ — ను వ్విచ్చే కట్నాలకీ ఇంకెవడొస్తాడో? నా తమ్ముడుకాబట్టి...తల చెడివున్నాడు. కాబట్టే...ఏదో ఒప్పుకున్నాడు." అని మొగుడినోరు మూయించేసింది మంగమ్మ

పెళ్ళి అనుకున్న దగ్గిర్నుంచీ బుచ్చిరాజు కాంతాన్ని రాసుకు రాసుకు తిరగటం — పళ్ళికిలిస్తూ నవ్వటం సాగించాడు

కాంతం మొహం ముడుచుకుని తప్పుకుపోయేది — నీ బడాయి ఎన్నాళ్ళో నేనూ చూస్తాలేవే !" అన్నా డోసారి అవోలా చూస్తూ.

కాంతాని కెందుకో భయం వేసింది. ఏడుపు వచ్చింది ఏడవడానికి కూడా భయం వేసింది

* * *

నెలలోపునే కాంతానికీ బుచ్చిరాజుకీ పెళ్ళయిపోయింది. కాంతానికి శోభనం కూడా అయిపోయింది బుచ్చిమావయ్య మీన కొత్తకొత్త యిష్టాలేవీ పుట్టుకు రాలేదు కాంతానికి. ఉన్న అయిష్టం కూడా మాసిపోలేదు, ఎక్కువైందేమో గానీ

అయినా ఆ పెళ్ళి నాలుగురోజులూ కొత్తయింట్లో చాకిరీ తగ్గింది కొత్త కొత్త గుడ్డలవీ కట్టుకోనిచ్చింది మంగమ్మ. బుచ్చిమావయ్యకూడా కాస్త నవ్వుతూనే మాటాడాడు 'ఫర్వాలేదు పెళ్ళో, గిళ్ళో ఏదో అయిందిలే' అనుకొంది కాంతం


బుచ్చిరాజు మనుగుడుపులు పరివూడ్పుల రోజుల్లోనే ఊడ్పులకి నాయుడుగారు తెచ్చుకున్న కూలిమనషులు చెరువుగట్టుకి అవతలివేపున గొడ్లపాకలలో మకాంపెట్టారు. సాయంత్రం బాగా చీకటిపడ్డాక పొలంలోంచి గుంపులు గుంపులుగావచ్చి, బిలబిల్లాడుతూ పాకలో దూరి, గడిమంటలతో బియ్యం వుడకేసుకుంటూ నవ్వుతూ పేల్తూ కబుర్లాడుకునే ఆడకూలీలని చూస్తూ చెరువు గట్టుమీదే నించునేవాడు కొత్త పెళ్ళికొడుకు బుచ్చిరాజు

కాంతం కాస్త పెందరాడే తిండి తిని బుచ్చిరాజుకోసం చూడకుండానే పడుకుని నిద్రపోయేది ఆ రాత్రి బుచ్చిరాజు అసలు ఇంటికి రానేలేదని తెలిసినా చీమకుట్టినటయినా వుండేదికాదు కాంతానికి.

కానీ ఓరోజు — చీకటి పడ్డాక నీళ్ళు పోసుకుని చాకలి వుతికి తెచ్చిన చీర కట్టుకుని — మిద్దెగడిలో పెట్టెల పాటున అలంకారానికి కూర్చుంది కాంతం

పెళ్ళయ్యాక కాంతానికో మేదరబొట్టుపెట్టె ఏర్పాటయింది

అందులో ఓ చెక్కదువ్వెన, అరచెయ్యంత అద్దం, తలచిక్కు తీసుకునే




చిక్కట్టు, కాటుకడబ్బీ, చిన్న వేసలైను బుడ్డీ, వునుగు సీసాలు, కొత్త పౌడరు డబ్బా - అన్నిటికన్నా బాగా ఖరీదైంది - రెండుతులాల వెండికుంకంకాయ.

అవన్నీ కాంతానికి స్వంతం రోజూ చీకటిపడ్డాక నీళ్ళు పోసుకుని - తల నున్నగా దువ్వుకుని, అరిచేతుల్లో తెల్లటి పౌడరు ఒంపుకుని అప్రయాపంగా మొహానికి రాసుకుని, పిసరంత పునుగు వేలితో గుడ్డలకి రాసుకుని, వెండి కుంకంకాయ తీసి బొట్టు పెట్టుకుని, అన్నీ పొట్టుపెట్టిలో సర్దేసి గట్టిగా మూత అంచేసి జాగ్రతగా మసిలిపిచ పెట్టేస్తుంది. మళ్ళా మర్నాడు రాత్రి నీళ్ళుపోసుకున్నాకే దాన్ని ముట్టుకోటం.

పెళ్ళయింతర్వాత ఆలా ముస్తాబు చేసుకుని అందంగా తయారవటం కాంతానికి బాగానే వుంది

"అప్పా నీ కోక ఎంతబాగా వాసనొస్తుందే!" అంటూ చెల్లెళ్ళు తన చుట్టూ చేరితే కాంతానికెంతో సిగ్గుముంచుకొచ్చేసేది.

ముసి ముసి నవ్వులు నవ్వుకొంటూ కాంతం తల నున్నగా దువ్వుకుని గట్టిగా కర్రలా జడ అల్లుకొని చివర పూలు ముక్క కుచ్చు పెట్టుకొంది. పౌడరు మొహానికి రాసుకొంది బేసరు కొమ్మ కిందికి ఒంగిపోతే బాగా సర్దుకొంది పునుగు వేలికి అంటించుకుని చీరకి అక్కడక్కడా పులుముకొంది. కాటుక వెడల్పుగా పెట్టుకొంది ... కుంకంకాయ తీయబోయింది కనిపించలేదు. గబగబా వెదికింది సింగారుకొద్దీ పొట్టుపెట్టి కింద కుమ్మరించింది లేదు.

డి కుంకంకాయ లేనేలేదు... పోయిందా? అమ్మో! ఎలా పోయింది? వెండిదికూడాను నిజంగా పోయినట్టేనా? ఇంకెక్కడున్నట్టు?—అప్పుడే కాంతానికి కళ్ళు పూడుకువచ్చేశాయి.

గబగబా వసారాలోకి వెళ్ళింది. మంగమ్మ చిన్నపిల్లలకి అన్నాలు పెడుతోంది "అమ్మా! నా బొట్టుపెట్టెలో కుంకంకాయ లేదే!"

"నిజంగానే...ఎండిదే..."కంగారు పడింది మంగమ్మ. "ఆఁ అదేనే! బొట్టెట్టుకుందామని చూశాను. ఎంత ఎతికినా దొరకలేదు"

"సరిగ్గా దాశావో లేదో మతిమరుపు ముండా! నీతో రోజుకొకగోల...ఎక్కడ పడేశావో సరిగ్గా చూడే!" అంటూ అరిచింది మంగమ్మ

కాంతం బిక్కచచ్చిపోయింది "బొట్టుపెట్టిలోనే పెట్టానే..."

"అమ్మా! అప్ప బొట్టుపెట్టి ఇందాక మావయ్య తీశాడే!" ఉత్సాహంగా చెప్పేశాడు శివరావు.

"ఎప్పుడ్రా? అదెందుకు తీశాడూ?"

"నిజంగానేనే. ఎవ్వరికీ చెప్పొద్దని నాకో అణాకూడా యిచ్చాడే! నేను జీళ్లు కొనేసుకున్నా."

కిక్కురుమనలేదు మంగమ్మ. కాంతంకూడా నెమ్మదిగా గదిలోకి పోయి కూర్చుంది

బొట్టు పెట్టుకోనేలేదు ... అసలు ఎప్పుడూ బొట్టు పెట్టుకోకూడదనిపించిందికూడాను

"ఎంత చక్కటి కుంకంకాయి! మూతమీద సింహం తలా — చుట్టూ చక్కగా ఆకులూ, పువ్వులూ — నిండా ఎర్ర కుంకం వుంది... వెండిది కూడాను." కాంతానికి ఎంతో ఏడుపు వచ్చేసింది ఇలా మొగుడే పెళ్ళాం వస్తువు ఎత్తుకపోతే ఎలాగ? రేపు పౌడర్ డబ్బా...ఎల్లుండి పునుగుసీసా అవన్నీ మాత్రం వుంటాయా?

అందరూ తిళ్ళు తిని మణిగే వేళకి వచ్చాడు, కొత్తల్లుడు బుచ్చిరాజు, అప్పవడ్డిస్తే తిని లేచాడు. మంగమ్మ ఏమీ పలుకరించకుండా వూరుకొంది

కాంతం మాత్రం కోపం ప్రదర్శించటానికి నేలమీద చెయ్యి తలకింద పెట్టుకుని పడుకుంది.

"అదేంటే కింద పడుకున్నావూ?" అంటూ చెయ్యి పట్టుకున్నాడు బుచ్చిరాజు. విదిలించుకొంది?

"ఏంటే కోపం జాస్తీగా వుందే! ఏంవైంది?" కాంతానికి కోపం ఆగలేదు — లేచి కూర్చుని—

"నా ఎండి కుంకంకాయి తీసుకుపోయావు కదూ?" అంది అసహ్యం అంతా వెల్లడిస్తూ

"ఛీ! నేనా? ఎవరన్నారు?"

"మా శివుడు చెప్పాళ్ళే అడి కో అణాకూడా ఇచ్చావటగా?"

''ఏడిశాడు, దొంగ ఎదవ! ఆడే తీశాడేమో! నేను మాత్రం తియ్యలేదే' నీమీద ఒట్టు. అ దెలా పోయిందో నాకు తెలవదు పోతే పోయిందిలే, ఇంకోటి చేయిస్తాలే."

''ఛీ! నా కేం అక్కర్లేదు.''—కుంకంకాయి దొంగచాటుగా తీసుకు పోయి ఒట్టుకూడా పెడుతోన్న మొగుణ్ణి చూసుకుంటే కాంతానికి బావురుమని ఏడుపు వచ్చేసింది.

"ఎందుకే ఆ ఏడుపూ?" విసుక్కున్నాడు బుచ్చిరాజు. అయినా కాంతం ఏడుపు ఆగలేదు. వెక్కి వెక్కి ఏడుస్తూనే పడుకొంది.

"అప్పా! ఇది చూడే! ఎలా సోకా లెడతందో!" తమ్ముడి ఫిర్యాదు విన్న మంగప్ప - నులకమంచంలోంచి లేచి వచ్చి తలుపుదగ్గిర తొంగిచూసింది– ''ఎందుకే ఎధవ ఏడుపు? నోరు మూసుకోక, ఆడి కేం మొగమారాజు, మడి కట్టుక్కూర్చుంటాడనుకున్నావా?...మళ్ళీ నోరెత్తిందంటే రెండు అంటించరా బుచ్చీ?" అనేసిపోయి నడ్డి వాల్చింది.

కాంతం ఏడుపు మానలేదు వినపడేలా మాత్రం ఏడవలేదు మొగుడు ఎవతి దగ్గిరకో పోయాడనికాదు కాంతంఏడుపు. అయినా వృత్తపుణ్యానికే ఎవతికేసో చూశాడని అయ్యని నానాతిట్లూ తిట్టిపోసే అమ్మసంగతి కాంతానికి తెలియందికాదు కన్నతల్లి బిడ్డల్ని ప్రేమించటమేకాదు, ద్వేషించగలదు కూడా. పుట్టినఘడియ నుంచీ కాంతాన్ని తల్లి ద్వేషిస్తోనేవుంది.

కాంతం ఏడుస్తోనే నిద్రపోయింది

* * *

కన్నీళ్ళతో ప్రారంభమైన కాంతం కాపరం — కంటితడి ఆరకుండా నే నాలుగేళ్ళు గడిచింది. పుట్టింటకూడా మంగమ్మ పెత్తనమే. కూతుర్ని ఓమూల కూర్చోబెట్టి — తమ్ముడికి పంతపాడుతూ పెత్తనం జరిపింది మంగమ్మ కన్నతల్లి ఎంత నిర్వాకం చేసిందో — కట్టుకున్న మొగుడూ అంతే చేశాడు కాంతానికి.

"అప్ప కాళ్ళాఏళ్ళాబడి ఏడిచిందని నిన్ను కట్టుకున్నానుగానీ — లేకపోతే ఎంతో అందమైనదాన్ని — రంభలాంటి దాన్ని — వెయ్యి రూపాయలైనా కట్నం తీసుకుని పెళ్ళి చేసుకునేవాణ్ణే. సిగ్గులేక ఇంకా నీలుగుతావెందుకే ఎదవముండా!" అని బుచ్చిరాజు రోజూ ఎప్పుడో అప్పుడు తన త్యాగంగురించి కాంతం ముందు వెల్లడించి తిట్టిపోస్తోనే వుండే వాడు తను జాలిపడి పెళ్ళి చేసుకుని కాంతాన్ని వుద్ధరించాడు. దానిమెళ్ళో మూడుముళ్ళూవేసి కన్నెచెర తప్పించాడు. ఆబుద్ధికూడా లేదు కాంతానికి, అనుకునే బుచ్చిరాజు ఎప్పుడేనా నవ్వుతూ మాట్లాడినా బిగుసికుపోయేది కాంతం వేళాకోళం చేసినా చిన్నబుచ్చుకునేది.

నాలుగోఏట కాంతానికి కొడుకు పుట్టాడు కాంతానికి నిజంగా కొడుకుని

కన్నందుకు గర్వం కలిగింది. బ్రతకటంలో కొంచెం అవసరం - ఆనందం - కన్పించాయి "నేనూ ఒక మనిషినే" అన్న నమ్మకం కలిగింది మొగుడి దగ్గరకూడా కాస్త ధైర్యంగా తిరగటం నేర్చుకొంది.

కొడుకుని కని యిచ్చిన కాంతం అంటేకూడా బుచ్చిరాజు కేం గొప్ప కనిపించలేదు రామం తల్లిలా నలుపే అయినా ఎత్తుపళ్ళు రాలేదు కొడుకు తల్లిదగ్గరే బాగా చనువు. తండ్రితో అంతగా సంబంధం లేకుండానే నాలుగైదేళ్ళవా డయ్యాడు ఒకటో క్లాసుకూడా చదువుతున్నాడు.


ఉన్నట్టుండి బుచ్చిరాజు జబ్బుపడ్డాడు ఓరోజు చలిచలిగా ముణగదీసుకు పడుకున్నాడు అదేం తెగులో పెద్దషెట్టున ముంచుకొచ్చింది మందుల వీర్రాజు కషాయాలు మింగుతూ ఆస్పత్రికి వెళ్ళటానికి వెనకా ముందూ ఆడాడు కాంతం నిద్రా నిప్పులూ లేకుండా చాకిరీ చేసింది కాళ్ళూ చేతులూ పట్టటం - కషాయాలూ జావలూ కాచటం - మందులూ మాత్రలూ మింగించటం - ఈగ వాల కుండా విసుర్తూ పూర్చోటం - ఎన్ని చేసినా బుచ్చిరాజు ఏంకెలేస్తూనే వుండేవాడు 'నువ్వు హాయిగా వండుకు తిన్నావూ ? నేను బాధతో చస్తున్నానే ముండా! ముండమోస్తేగానీ నీకు బుద్ధి రాదులే కాళ్లు లాక్కుపోతున్నాయి గట్టిగా నొక్కవే. గిన్నెడూ మింగావుగా ? సత్తువ లేదూ ? ఎవడికి దారపోశావే ?" గంగిరెత్తిన వాడిలా తిట్టిపోస్తూనే వుండేవాడు.

"ముండా ! నువ్వు మంచిదానివైతే నాకీ రోగం రాకపోయేదే!" అన్నాడో సారి. కాంతం తెల్లబోయింది. మొగుడెందు కలా తిట్టాడో ఎప్పటికీ అర్ధం కానేలేదు కాంతానికి.

ఆఖరి రెండు రోజులూ గొడ్డులా బాధపడి సుఖరోగాలతో యమయాతనా అనుభవించి కుళ్ళికుళ్ళి చచ్చిపోయాడు - బుచ్చిరాజు

మొగుడు మంచంమీద వున్నప్పుడు ఒళ్ళు దాచుకోకుండానే చాకిరి చేసింది గానీ...తీరా మొగుడు చచ్చిపోయాక మనసారా ఏడవలేదు కాంతం ఎందుకో కాంతానికి బుచ్చిరాజు శవాన్ని చూస్తోన్నా చచ్చిపోయాడన్న నమ్మకం కలగలేదు. హఠాత్తుగా లేచి తనని తిట్టిపోస్తాడని భయం పట్టుకొంది.

తమ్ముడి రోగం కబురు తెలిసినా పట్టించుకోకుండా వూరుకున్న మంగప్ప ఏకంగా చావుకబురు విని బయల్దేరి వచ్చింది రెండెడ్ల బండిలోంచే - 'ఓరి తమ్ముడో, నా బిడ్డని దగాచేశావా ? నా కడుపులో చిచ్చుపెట్టావా ? నీదారి నువ్వు చూసుకున్నావా ? అప్పుడే నూరేళ్ళు నిండిపోయాయా ? తమ్ముడో...తమ్ముడో... బుచ్చిరాజో," అంటూ పెడ




బొబ్బలుపెట్టి ఏడుస్తూ దిగి కూతుర్ని వాటేసుకుంది.

అప్పటికి కాంతాని కేం దుఃఖం రాలేదు. తనకి కొత్తగా ఏం ఆపద ముంచుకొచ్చిందో — ఇన్నాళ్ళూ తనకోసం వున్నవాళ్ళెవరు లేకుండాపోయారో అర్థంకాలేదు.

ఏడవకుండా మొద్దులా కూర్చున్న కాంతాన్ని మంగమ్మ కొరకొరచూసి ముక్కు చీదేసింది తల్లిచూపుకి భయపడ్డ కాంతం... కాస్సేపు జతగా "ఊ, ఊ," అంటూ చిన్నపిల్లలు ఏడ్చినట్టు రాగం తీసింది...కాస్సేపటికి అదీ చేత కాక వూరుకొంది- బుచ్చిరాజుకి దినాలు, వారాలు అయ్యాయి.

"ఇక నీ కిక్కడేవుందే కాంతం? ఆ కుర్రనాగమ్మని తీసుకుని వచ్చెయ్. అక్కడే పడివుందాం కలోగంజో తాగుదాం," అంది మంగమ్మ కూతుర్ని ఓదారుస్తూ.

బుచ్చిరాజు చచ్చిన్నాటినుంచే కాంతం బుర్ర కొత్త స్వతంత్రంగా పనిచెయ్యటం ప్రారంభించింది. అప్పులకింద ఎంత పోయినా రెండెకరాల పొలం మిగులుతుందని కరణం చెప్పాడు. ఉండటానికింత కొంపవుంది. వండుకు తినడానికి గిన్నీ, ముంతా వున్నాయి. కొడుకు అప్పుడే ఒకటోక్లాసు చదువుతున్నాడు.

ఇలాంటి పరిస్థితుల్లో తను పోయి పుట్టింట కూర్చోవటం బుద్ధితక్కువే. శివరావు మేనమావ కన్నా అద్వాన్నంగా తయారయ్యాడు. తల్లికి తండ్రికీ తమ్ముళ్ల

తగలనిరోజు లేదు. అలాంటి మేన మామ చేతుల్లో తన కొడుకుని పెట్టి — రెండెకరాల చెక్కనీ అప్పగిస్తే... తనపాట్లు కుక్కలకికూడారావు.

"ఏంటే అలా కూచున్నావు కాంతం. లేచి సామానదీ సర్దుకో బండికట్టించుకు పోదాం. పోయినవాళ్ళతో పోతామా? ధయిర్యం తెచ్చుకో," అంది మంగమ్మ మళ్ళా

కాంతం కంఠం పెగిలించుకుని అనే సింది —

"నేను ఎక్కడికీ రానే అమ్మా! కుర్రోణ్ణిపెట్టుకుని యిక్కడ వుంటాలే"

మంగమ్మ ఉరిమిచూసింది. కూతురి తెలివికి ఆశ్చర్యపడింది — "అదేంటే కాంతం. పుట్టింటోళ్ళంతా చచ్చారను కున్నావా? ఆ కుర్రసన్నాసిని పెట్టుకుని ఒక్కదానివీ వుంటావా? కాలు నొచ్చినా చెయ్యి నొచ్చినా..." ససేమిరా కాంతం ఒప్పుకోలేదు— "నాకేం లోటే అమ్మా! నోరు మంచిదైతే వూరంతా మంచిదే బుచ్చిమావయ్య వున్నప్పుడు మాత్రం నేను ఒక్కదాన్నేకదా వున్నాను అలాగే వుంటాను. కావన్న పొలం మగతాకి తీసుకుంటాడు. ఎలాగో ఒబ్బడిగా గడుపుకుంటాను"

కూతురి గడుసుదనానికి మంగమ్మకి చివాలెత్తింది — "నీవుద్దేశం ఏంటో వుందిలే. ఊరొదిలి ఎందుకు రానంట న్నావో నాకూ తెలుసులే. మొగుడెలాగూ చచ్చాడని... తెయ్యతక్క లాడక కాస్త పరువూ మర్యాదా నిలబెట్టుకో. మంగమ్మ కూతుర్ననిపించుకో." అంటూ రంకె లేసింది.

కాంతం కిక్కురు మనలేదు ఆ సాయంత్రమే కూతురితో మాటాపలుకూ లేకుండా మంగమ్మ బండి కట్టించుకు వెళ్ళిపోయింది

* * *

తెల్ల సైనుగుడ్డా – ముచ్చినగుంటన ముడీ – చేతిలకి ఇత్తడి గాజులూ – చొత్తిగా వెలవెలాబోతూ కాంతం ఒక్కతీ నట్టింట్లో కూర్చుంది – బళ్ళోకి పోయిన కొడుకుకోసం ఎదురుచూస్తూ.

కాంతానికి పుట్టిన దగ్గర్నుంచీ ఎవ్వరూ అంత చేరువకాలేదు ఆ కొడుకు తప్పితే కాంతానికి ప్రపంచంలో ఎవ్వరూలేరు నెలలు మోసి – కష్టపడి కని పెంచుకుంటోన్న ఆ బిడ్డచుట్టూ కాంతం తన బ్రతుకు నిర్మించుకొంది కొత్తగా.

వాణ్ణి కనటానికే తనని దేవుడు పుట్టించాడు. వాణ్ణి పెంచి పెద్ద చెయ్యటానికే తనకి ఆరోగ్యం, ఆయుష్షూ ఇచ్చాడు తన బ్రతుక్కి సార్ధకత ఆ కొడుకుని పెంచటం ఒక్కటే.

కొత్తగా తెల్లగుడ్డలు కట్టుకుంటున్న తల్లిని చూస్తే రామానికి ఏదో భూతాన్ని చూసినట్టే అన్పించింది కొన్నాళ్ళు.

గడపలోకి పుస్తకాల సంచీ గిరవాటు పెట్టి చింతచెట్టుకిందకి పరిగెత్తుకు పోయాడు "నాయనా! రామన్నా! తాయిలం తినిపోతావా?" అంది కాంతం రామం వెనక్కి వచ్చేసరికి పేలప్పిండీ-బెల్లంపొడీ కలిపి గిన్నెలో పెట్టి యిచ్చింది

వాడు గబగబా నాలుగునోళ్ళు బొక్కి- "మంచినీళ్ళు తాగరా నాయనా!" అంటున్నా విన్పించుకోకుండా చింతచెట్టుకిందికి పరిగెత్తాడు.

కాంతం పొయ్యి అంటించి చిటుకులు వంటపెడుతూ బియ్యం పొంగించింది. పొయ్యిమీద నీళ్ళు పడేసింది మళ్ళా పీధి గడపలో కొచ్చి కూర్చుంది. చీకటిపడితే లేచి ప్రమిదె వెలిగించింది కొడుకు యింటికి వచ్చేవరకూ కాచి పెట్టుకు కూర్చుంది.

రామం చెమటలు కక్కుకుంటూ వచ్చాడు— "అమ్మా, ఆకలే" అంటూ.

కాంతం గబగబా పొంతకుండ దొడ్లో పడేసింది. సున్నిపిండితో కొడుక్కి ఒళ్ళంతా తోమి తోమి నీళ్ళు పోసింది తడిఒంటితో కొడుకుని చంకన వేసుకొంది— "నడవకు ... అరికాళ్ళకి బాడి అవుతుంది బాబూ!" అంటూ ఇంట్లోకి తీసుకుపోయి నించోబెట్టింది. పమిటతో వాడి ఒళ్ళంతా తుడిచింది. పెద్దపీట వేసి కూర్చోబెట్టింది "అమ్మా! ఇది అయ్య పీటేనా?"

కొడుక్కి ఆ పీటమీద కూర్చున్నప్పుడుమాత్రం తండ్రి జ్ఞాపకం వస్తాడు. పీటని రెండు చేతులతోటీ తడుముతూ "అయ్యపీట, అయ్యపీట" అంటాడు. అప్పుడు మాత్రం కాంతానికి గుండెలు బరువెక్కుతాయి "అయ్యో! నా బిడ్డకి తండ్రి లేకపోయాడే! ఆరేళ్ళనాడే అనాథుడై పోయాడే కొడుకు," అనుకొంటూ దిగాలుపడిపోతుంది కాస్సేపు.

అలాగే కాంతానికి దుఃఖం వచ్చింది— "మీ అయ్యపీటే బాబూ! ఇక యింట్లో మొగది క్కెవరున్నారు, నువ్వే" అంది.

కంచుగిన్నెలో వేడివేడి అన్నం పెట్టి చింతకాయ పచ్చడి కలిపి ముద్దలు తినిపించింది

"అమ్మా! ఇంక వద్దే."

"ఇదిగో బాబూ! పెరుగన్నం తినవా?" అంటూ మట్టిపిడతలో తోడు పెట్టిన పెరుగు గిన్నెలోకి ఒంచింది

"అమ్మా! నీకో?"

కాంతం మొహం విప్పారింది. కొడుకు అలా తన గురించి అడిగితే ఒళ్ళంతా ఆనందం పరుగులెత్తింది.

"నా బాబే! నాకు వొద్దులేరా! గంజీ నీళ్ళు పోసుకు తింటాను నువ్వు కడుపు నిండా తిను," అంటూ కూరికూరి తినిపించి మూతి కడిగింది

నట్టింట్లో చాప పరిచి దీపం పెట్టింది. పుస్తకాలు తెచ్చి దగ్గిర పెట్టింది.

తను గిన్నినిండా అన్నం పెట్టుకుని గడపదగ్గిర తింటూ కూర్చుంది.

నిద్రమత్తుతో జోగుతున్న కొడుకు— "అది నా కన్ను. నా కన్ను అక్కడ వున్నది. అది నా ముక్కు. నా ముక్కు అక్కడ వున్నది'' అంటూ చదువుకు పోతోంటే పరమానందంగా వింటూ... దూరదూరంగా ఆలోచనలు చేస్తూ వుండి పోయింది.

పంతులుగారికో రూపాయి డబ్బులు యిచ్చయినా సరే రామన్నకి బాగా చదువు చెప్పించాలి. ఇప్పుడు ఒకటి చదువు తున్నాడు. వచ్చే ఏడు రెండు చదువుతాడు...ఆ మరుసటేడు మూడు పదేళ్ళూ కళ్ళుమూసుకుంటే పదోతరగతి చదువుతాడు, తర్వాత ఏ బియ్యే పరీక్షో చదువుతాడు. రామన్న అంతటివాడే. నా కంఠంలో ప్రాణం వుండాలిగానీ... ఎలాగో చదివిస్తానుగానీ వూరుకోను ''

కాంతం కళ్ళల్లోకి కాంతి పారింది తనకొడుకు పెద్ద చదువులు చదివి... పెద్ద వుద్యోగం చెయ్యడా ?... ఆ సంతోషం అంతా తనదికాదా ? కాలం ఎంతలో గడుస్తుందీ ? నిన్న మొన్నటి వాళ్ళంతా ఎదిగిపోపటంలేదూ ? ఆ ఏడు కొండలవాడు చల్లగా చూడాలిగానీ... తనకీ తన బిడ్డకీ ఏవీ ఫర్వాలేదు.

* * *

కాంతమ్మ భారమంతా ఏడుకొండల వెంకటేశ్వరుడిమీదే వేసి బిడ్డని సాకుతూ వచ్చింది. నోరూవాయీలేని ఒక ఆడది పసిబిడ్డణ్ణి పెట్టుకుని ఒంటరిగా బ్రతకటానికి ఎన్ని యాతనలు పడాలో అన్నీ అనుభవించింది కాంతమ్మ.


మంగమ్మ చివరిరోజుల్లో కొడుకు తన్నితగిలేస్తే విధవకూతురి కొంపకే జేరి నెల్లాళ్ళపాటు తీసుకుతీసుకు చచ్చింది.

కాంతమ్మకి అప్పుడూ దుఃఖం రాలేదు. "పుట్టినవాళ్ళు గిట్ట కేంచేస్తారు. అంతా ఏడుకొండలవాడి దయ,'' అని కళ్ళు తుడిచేసుకుంది

రామం పెద్దవుతోన్నకొద్దీ తల్లికి దూరమే అయ్యాడు. ఫస్టుఫారం చదవటానికి హైస్కూలుకి పోయిన్నాడే తల్లి ఒడి మర్చిపోయాడు. పుస్తకాలూ — బడీ — స్నేహితులూ — చదువూ వాడి ప్రపంచం అయ్యాయి.

తల్లి పెట్టింది తిని, తల్లి చెప్పినట్టు విని, కష్టపడి ఏళ్ళతరబడీ చదివి పరీక్షలు పేసయ్యాడు. కాలం గిర్రున తిరిగినట్టే తోచింది కాంతమ్మకి. కొడుకు పాతికేళ్ళవా డయ్యాడు. పెద్ద చదువే చదివాడు పెద్ద వుద్యోగం సంపాదించుకున్నాడు. తల్లిని తీసుకుని బస్తీకి వెళ్ళిపోయాడు ఇష్టపడ్డ పిల్లని పెళ్ళిచేసుకుంటానంటే మహా సంతోషంతో ఒప్పుకుంది కాంతమ్మ.

కోడలు అందాల భరిణె. దంతం బొమ్మ. సన్నజాజి పువ్వులా వుండే కోడల్ని కన్నార్పకుండా చూస్తూ...




అంతలోనే కళ్ళు దించేసుకుంటుంది కాంతమ్మ.

"ఆడదై పుట్టాక...అందం చందం వుండాలిగానీ...అయ్యో! పిల్లకి దిష్టి తగిలేను" అని భయపడి కోడలి మొహంకేసి సరిగ్గా చూడ్డంకూడా మానేస్తుంది.

కొడుకుబ్రతుకు పండువెన్నెల్లా అయింది అదే కోరుకుంది కాంతమ్మ.

కాంతం ఎన్నడూ పుట్టింటికి తొంగి చూడలేదు. చెల్లెళ్ళంతా ఎక్కడున్నారో కూడా సరిగ్గా తెలీదు. తమ్ముడు ఒక్కసారికూడా పిల్చుకుపోలేదు. దేన్నీ పట్టించుకోలేదు కాంతమ్మ. తనయిల్లే స్వర్గం. తనకొడుకూ కోడలూ దేవతలు. వాళ్ళ అందచందాలు చూసుకొంటూ — వాళ్ళకి సదుపాయాలు అమరుస్తూ ... ఏడుకొండలవాడికో దణ్ణం పెట్టుకొంటూ ఈ తనువు యిలా చాలిస్తే ... చాలు. ఇంకేంకావాలి కాంతమ్మకి? ఎప్పుడైనా ఒక్కసారి బ్రతికివుంటే...ఏడుకొండలవాడి దర్శనం చేసుకొంటే...చాలు. చాలు. నిశ్చింతగా కళ్ళు మూసేస్తుంది.

* * *

కాంతమ్మ గడపలో కూలబడది కూలబడ్డట్టేవుంది. పక్కన చేతిసంచీ పడివుంది.

బాగా చీకటిపడింది. "ఎవరూ? రామన్నా! అబ్బే! ఎందుకు తీసికెళ్తాడూ? ఏడు కొండలవాడి పిలుపు రాందే!" అని గొణుక్కుంది. ఎందుకో నవ్వుకొంది. అలాగే చేతిసంచీని బుర్రకింద పెట్టుకుని పడుకొంది — బయల హోరున వాన ప్రారంభించింది. తెల్లవారింది.

నాగరత్నం గులాబీ పువ్వులకోసం వచ్చింది వీధివేపు "ఇదేమిటి, తలుపులకి తాళం లేదే!" అంటూ ఇంట్లోకి తొంగిచూసింది

కాంతమ్మ ముద్దలా పడివుంది గడప దగ్గర నాగరత్నం హడిలిపోయింది ఒక్కక్షణం తటపటాయించి లోపలికి అడుగుపెట్టింది — "పిన్నిగారూ?"

"అయ్యో! అదేమిటీ? మీరు వెళ్ళనే లేదూ? నిన్నటినుంచీ నే నిటు చూడనే లేదు"

కాంతమ్మ కళ్ళు తెరిచింది అదో మాదిరిగా చూసింది "మా రామన్న లేడు. బళ్ళోకి వెళ్ళాడు" తెల్లబోయింది నాగరత్నం — "మీరు తిరుపతి వెళ్తానన్నారుగా పిన్నిగారూ?"

"కుర్రసన్నాసి, వాడి కేం తెలియదమ్మా: వాడి తప్పేలేదు వాన బాగా కురిసిందా? ఆఁ అదీ" నాగరత్నాని కేం అంతుపట్టలేదు. ధైర్యం చిక్కపట్టుకుని కాంతమ్మ ఒంటిమీద చెయ్యి పెట్టి చూసింది. ఒళ్ళంతా మాడిపోతోంది

"అయ్యో! పిన్నిగారూ! బాగా జ్వరం వచ్చిందండీ! మీ రేదో పరాగ్గా కూడా మాట్లాడుతున్నారు పాస్పు పడుకోండి నేను కొంచెం జావ కాచి తెస్తాను" నాగరత్నం గబగబా మంచం వాల్చింది దుప్పటి పరిచింది. కాంతమ్మని లేవదీసి పడుకోబెట్టింది. తలుపులు దగ్గిరికి వేసి వెళ్ళిపోయింది.

కాంతమ్మ గుడ్లు తెరిచి చూస్తూ పడుకొంది ఆ చూపుల్లో కాంతి పూర్తిగా హరించిపోయింది. జీవం, చైతన్యం కొడిగడుతున్నాయి.

హఠాత్తుగా లేచి కూర్చుంది. పంచె కొంగు భుజంమీంచి జారి నేలమీద పారాడుతోంటే లాక్కుంటూ వంటింటి గుమ్మం దగ్గిరికి వెళ్ళి, పెరటి తలుపులు తీసింది — కళ్ళకి చెయ్యి అడ్డం పెట్టుకొంటూ కాకరపాదుకేసి చూసింది — "నాయనా! రామన్నా! వానలో జామ చెట్టెక్కావా? జొరం వస్తుందిరా తండ్రీ! అయ్యో! అయ్యో! కాలు జారి పడిపోతావురా! దిగిరా! తాయిలం పెడతాను. నా బాబువికావూ? దిగిరారా రావుఁడూ!" అంటూ ప్రాధేయపడుతూ నిలబడింది — "కుర్రసన్నాసి మాట వింటేగా? ... ఊహూ!" అంటూ గొణుక్కొంటూ ఇవతలికి వచ్చింది

నట్టింట్లో అటూ యిటూ తచ్చాడటం మొదలుపెట్టింది వీధి తలుపులు తెరుచుకున్నాయి రామం వెనకే గీతకూడా లోపలికి వచ్చింది రిక్షావాడు పెట్టెంగు పడేసి పోయాడు

చిరాగ్గా కుర్చీలో కూర్చుంది గీత అంతవరకూ విచిత్రంగా చూస్తోన్న కాంతమ్మ మొహమంతా సంతోషం వెల్లడిస్తూ — "ఎవరూ? మా రామన్న కోసమా? కూర్చోండి. కూర్చోండి. బాబూ! ఇప్పుడే బళ్ళోకి వెళ్ళాడు

పంతులుగారు తీసికెళ్ళారు. వచ్చేస్తాడు. అన్నం తిన్నాదేకాదు," అంటూ రెండడుగులు ముందుకు వచ్చింది.

గీత భయంగా రామం చెయ్యి పట్టుకుంది రామంకూడా విస్మయంగా తల్లికేసి చూశాడు. నాగరత్నం వేడివేడి నూకలజావ గిన్నె పైటకొంగుతో పట్టుకుని లోపలికి వచ్చింది.

''అక్కయ్యా! అమ్మ కేమైందీ? అలా మాట్లాడుతోం దేమిటీ?" నాగరత్నాన్ని చూస్తూ ఆడిగాడు రామం

"నాకు తెలీదు. అసలు మీరంతా వూరు వెళ్ళా రనుకున్నాను తిరుపతి వెళ్తానసీ - దేవుణ్ణి చూస్తానసీ - నిన్న కూడా నాకు చెప్పింది పిన్నిగారు రాత్రి జోరున వాన కురుస్తోంటే నే నసలు ఇటుకేసి రానేలేదు. ఇప్పుడే నా వంట ఆయ్యింది గులాబీపువ్వులు కోసుకుందామని వస్తే...'' అంటూ ఏకరువు పెట్టింది నాగరత్నం - "జ్వరం బాగా వచ్చింది రామం!'' అంది చివరికి

అంతలోనే కాంతమ్మ గబగబా పెరటి కేసి వెళ్ళింది - "నాయనా, రామన్నా! నీళ్ళు పోసుకుంటున్నావా? వుండు, వుండు. వీపు రుద్దుతాను. ఎంతసే పలా నీళ్ళలో కొట్టుకుంటావు? తొందరగా తెమిలిరా!'' అంటూ కేక పెట్టింది.

పీట వాల్చి పళ్ళెం పెట్టింది. గ్లాసు పెట్టి ది.




"నా మాట వినరా! గమ్మున రారా రావుడూ! రెండు ముద్దలు తినిపోరా! నీ కోసం కళ్ళు కాయలుకాచేలా ఎదురు చూస్తున్నానురా!'' అంటూ నేల మీద చదికిలబడి కూర్చుంది

"వెర్రినాగన్న!: మాటవినటం మానేశాడు,'' అంటూ గొణుక్కొంది —

"నాయనా! రావుడూ! న న్నిలా ఏడిపించకురా! నా సంతోషమంతా నీమీదే పెట్టుకున్నానురా నువ్వు బాగా చదువుకుని... పెద్దవాడివై... చక్కటి పిల్లని పెళ్ళిచేసుకోవాలి. తెలిసిందా? నీ కడుపు నో కాయ కాస్తే...ముందు తిండి తినరా! లేచిరా! తరువాత రాసుకుందువులే. న న్నిలా ఏడిపించకురా!'' కాంతమ్మ

కళ్ళవెంట జలజలా నీళ్ళు రాలేయి. "అమ్మా అయ్యా ఆదరించకపోయినా - కట్టుకున్న మొగుడు లెక్క చెయ్యక పోయినా, నీ కోసమే బ్రతుకుతున్నానురా నేను నిన్ను చూసుకుని పుట్టెడు బలం తెచ్చుకుంటున్నారా నా మాట వినరా బాబూ! రెండు ముద్దలు తినిపో."

నాగరత్నం జావగిన్నె కింద పెట్టి రామంకేసి భయంగా చూసింది రామం మొహం పొత్తిగా కళావిహీనమై పోయింది అతికష్టంమీద అన్నాడు - "నిన్న మేమిద్దరం బయలుదేరివెళ్ళాం కానీ - వర్షాలకి రైలుకట్ట ఎక్కడో పాడైందట రాజమండ్రి కివతలే రైలాగిపోయింది. ఇటు వచ్చే బండిలో రాత్రికి రాత్రే బయల్దేరి వచ్చేశాం రాత్రి అమ్మ కేమైందో తెలీటంలేదు"

"కంగారుపడకు రామం. జ్వరం బాగా వచ్చేసింది పరాగ్గా మాట్లాడుతోంది." నాగరత్నం రెండడుగులు వేసి కాంతమ్మ దగ్గిరకి వెళ్ళింది - "పిన్నిగారూ! మీ రామం వచ్చేశాడండీ వూరునుంచి. చూడకుండా అలా కూర్చున్నారేం? అదుగో...రామం."

కాంతమ్మ పడుతూ లేస్తూ వచ్చింది. కొడుకునీ కోడల్నీ ఎగాదిగా చూసింది. "అబ్బే! మా రామన్న కుర్రసన్నాసి. ఏడేళ్ళ వెధవ ఇదిగో బళ్ళోకి వెళ్ళాడమ్మా! వస్తూవుండాలె" కళ్ళకి చెయ్యి అడ్డం పెట్టుకుని వీధి గుమ్మంలోంచి చూస్తూ నించుంది - "పిచ్చి నాగన్న ఏ చింతచెట్టుకింద కూర్చున్నాడో సరిగ్గా యింటికి రాడు, మాట వినడు ' గొణుక్కుంటూ వెనక్కి తిరిగింది.

"అమ్మా' అంటూ వెర్రికేక పెట్టి తల్లిని పొదివి పట్టుకుని పొంగి పొర్లుతోన్న దుఃఖంతో బావురు మన్నాడు కొడుకు

